WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

తెలుగు దిన పత్రిక

NETI DARSHINI TV TELANGANA

రంగారెడ్డి, నల్గొండ | సంపుటి : 01 | సంచిక : 05 | బుధవారం 20 - 11 - 2024 | ఎడిటర్ : కట్ల సత్యనారాయణ | పేజిలు : 4 | వెల : 3

## అభివృద్ధిని అడ్డుకుంటే జైల్లోవేస్తా..!



- కాళ్లల్లో కట్టెలు పెడ్తే ఊచలు లెక్కబెట్టిస్తం
- తెలంగాణ ద్రోహి మోదీకి కిషన్‌రెడ్డి
- గులాంగిరీ చేస్తున్నాడని సీఎం ఆగ్రహం

నేటి దర్శిని, వరంగల్ : అభివృద్ధిని అడ్డుకుంటే జైలుకు పంపిస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేతలపై అసహనం వ్యక్తంచేశారు. మూసీ ప్రాజెక్టు పేరిట పేదల ఇండ్లను కూల్చడం, ఫార్మా సిటీ పేరుతో గిరిజనుల భూములను గుంజుకోవడానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉద్యమిస్తున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి అసహనంతో ఊగిపోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న నేపథ్యంలో వరంగల్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'ఇందిరా మహిళాశక్తి విజయోత్సవ సభ'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅథితిగా ప్రసంగించారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమే అయినా అసందర్భంగా రాజకీయ వ్యాఖ్య లు చేస్తూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్,

2



## ఢిల్లీని కమ్మేసిన పొగమంచు

నేటి దర్శిని, న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతున్నది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతుండడంతో పొగమంచు భారీగా కమ్మేస్తున్నది. పొగమంచు, వాయు కాలుష్యంతో రైళ్లు, విమానాల రాకపోకలపై

2

## ఆ ఇద్దరు నేరగాళ్లను భారత్‌కు అప్పగించండి




నేటి దర్శిని, న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలో బిజీబిజీగా గడుపుతు న్నారు. ప్రస్తుతం ఆయన బ్రెజిల్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. బ్రెజిల్ రాజధాని రియో డి

2

## రాష్ట్రపతికి ఖర్గే లేఖ

### మణిపూర్‌లో శాంతి పునరుద్ధరణకు జోక్యం చేసుకోవాలి





నేటి దర్శిని, న్యూఢిల్లీ : మణిపూర్‌లో మళ్లీ హింసాత్మక ఘటనలు చేటుచేసుకోవడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రంలో శాంతి పునరుద్ధరణకు జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ను కోరారు. ఈ మేరకు రాష్ట్రపతికి ఖర్గే లేఖ రాశారు. మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించడంలో కేంద్రం, బీజేపీ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు. గత ఏడాది మణిపూర్‌లో జాతుల ఘర్షణతో పెద్దఎత్తున హింసాకాండ చెలరేగినప్పటి నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ రాష్ట్రంలో పర్యటించకపోవడాన్ని ప్రశ్నించారు. మణిపూర్ గత 18 నెలలుగా అసాధారణ రీతిలో కల్లోల పరిస్థితిని ఎదుర్కొంటుండటంతో దేశం పెను విషాదాన్ని చవిచూస్తోంది. హింసాత్మక ఘటనల్లో మహిళలు, చిన్నారులు, అప్పుడే పుట్టిన శిశువులు సహా 300 మందికి పైగా

2

## హైకోర్టు కీలక తీర్పు




నేటి దర్శిని, హైదరాబాద్ : ఇప్పటికే రెగ్యులర్ అయిన కాంట్రాక్ట్ ఉద్యోగులకు తొలగించ వద్దని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఇక ముందు భర్తీ చేసే ఉద్యోగాలన్నీ చట్ట

2

## చేతగానోనికి మాటలెక్కువ



నేటి దర్శిని, హైదరాబాద్ : హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన కాంగ్రెస్ సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. చేతగానోనికి మాటలెక్కువ.. చేవలేనోనికి బూతులెక్కువ అన్నట్లు రేవంత్ రెడ్డి పరిస్థితి ఉందని హరీశ్‌రావు విమర్శించారు. పదకొండు నెలల పాలనలో ఆయన నోటి నుండి బూతులు తప్ప నీతులు రాలేదు. కాంగ్రెస్ విజయోత్సవ సభ అని పేరు పెట్టుకొని చేసిందేమీ లేక, చెప్పుకోవడానికి ఏమీ లేక ఎప్పటి లాగే పిచ్చి మాటలు వదిలిండు. ఇక నువ్వు ఎంత గింజుకున్నా లాభం లేదు. అశోక్ నగర్ నుంచి లగచర్ల దాకా, రైతుల

2

## పోలవరం ఎత్తు తగ్గేదే లేదు



నేటి దర్శిని, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి, వెన్నముక పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులపై లఘు చర్చ సందర్భంగా మంగళవారం శాసన సభలో సీఎం మాట్లాడారు. విభజన చట్టం పోలవరం ఎత్తు 45.72

2

## టైం మీరు చెప్తారా మమ్మల్ని చెప్పమంటారా



నేటి దర్శిని, హైదరాబాద్ : నాంపల్లి బిజెపి పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించిన మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన సంబరాలపై ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. మెజార్టీ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని చెబుతున్నారంటూ విమర్శించారు. ముచ్చర్లలో గత ప్రభుత్వం 14 వేల ఎకరాలు భూసేకరణ చేశారు. ఆ భూములు

2

## స్వచ్ఛమైన నీరందించడంపై ప్రత్యేక దృష్టి



నేటి దర్శిని, అమరావతి : గత వైసీపీ ప్రభుత్వం తాగునీటి సరఫరాలో పూర్తి నిర్లక్ష్యం వహించడం వల్లే ఏపీ ప్రజలు డయేరియా వంటి రోగాల బారిన పడ్డారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరోపించారు. జగన్ సర్కార్‌లో పాలకులు రక్షిత తాగునీరు సరఫరాపై కనీస శ్రద్ధ చూపకపోవడం వల్లే రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యం బారిన పడ్డారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో గ్రామానికి కనీసం

2

## ఢిల్లీని కమ్మేసిన పొగమంచు

మొదటిపేజీ తరువాయి

తీవ్రంగా ప్రభావం పడుతున్నది. కాలుష్యం కారణంగా దాదాపు 40 రైళ్లపై తీవ్ర ప్రభావం పడింది. ఫలితంగా ఆయా రైళ్లన్నీ ఆలస్యంగా నడుస్తున్నాయి. రాజధాని ఢిల్లీకి నడిచే రైళ్లన్నీ ఎనిమిది గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయి. పొగమంచు, కాలుష్యం కారణంగా దృశ్యమానత సరిగా లేకపోవడమే ఇందు కారణం. జమ్మూ రాజధాని, పురుషోత్తం, శ్రమజీవి, ఇంటర్‌సిటీ సహా అనేక రైళ్లన్నీ ఆలస్యంగా నడుస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో రైల్వేశాఖ ఆలస్యంగా నడుస్తున్న రైళ్లకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ సీజన్‌లో తొలిసారిగా పొగమంచు కారణంగా భారీగా రైళ్లు ప్రభావితమవుతున్నాయని పేర్కొంది. పొచమంచు కారణంగా దృశ్యమానత చాలా తక్కువగా ఉందని.. రాత్రి సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని తెలిపింది. ప్రయాణికుల భద్రతే రైల్వే మొదటి ప్రాధాన్యత అని.. అందుకు రైళ్లను నెమ్మదిగా నడిపిస్తున్నట్లు పేర్కొంది. ప్రయాణికులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని.. ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నట్లు తెలిపింది. ఢిల్లీకి రైళ్లు ఆలస్యంగా నడుస్తున్న జాబితాలో విశాఖపట్నం - న్యూఢిల్లీ (20805) ఏపీ ఎక్స్‌ప్రెస్, పురుషోత్తం ఎక్స్‌ప్రెస్ (12801), శ్రమజీవి ఎక్స్‌ప్రెస్ (12391), రాణిఖేత్ ఎక్స్‌ప్రెస్ (15014), జమ్ము తావి ఎక్స్‌ప్రెస్ (12414), జమ్మూ మెయిల్ (14034), పంజాబ్ మెయిల్ (12138), డీడీఎన్ కోటా ఎక్స్‌ప్రెస్ (12402), ఇండోర్ -న్యూ ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ (12415), యూపీ సంపర్క్ క్రాంతి (12447), సైనిక్ ఎక్స్‌ప్రెస్ (19701), యోగా ఎక్స్‌ప్రెస్ (19031), మాల్వా ఎక్స్‌ప్రెస్ (12919) ఆలస్యంగా నడుస్తున్నాయని పేర్కొంది.

## హైకోర్టు కీలక తీర్పు

మొదటిపేజీ తరువాయి

ప్రకారం నిర్వహించాలని హైకోర్టు తన ఆదేశాల్లో వెల్లడించింది. నేటి నుంచి ప్రభుత్వ ఉద్యోగాలన్నీ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ కాకుండా నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయాలని తన ఆదేశాల్లో హైకోర్టు పేర్కొంది. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై తెలంగాణ హైకోర్టు మంగళవారం ఈ తీర్పు వెలువరించింది. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడాన్ని నిరుద్యోగులు హైకోర్టులో సవాలు చేశారు. ఈ నేపథ్యంలో హైకోర్టు పైవిధంగా స్పందించింది. గతంలో 5,600 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే జీవో 16లోని సెక్షన్ 10ఏ ద్వారా రెగ్యులరైజ్ చేయడాన్ని సైతం ఈ సందర్భంగా హైకోర్టు తప్పు పట్టింది.

రాష్ట్రంలో మొత్తం 40 విభాగాల్లో ఉన్న 5,544 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను గత ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. వారిలో దాదాపు 3 వేల మంది జూనియర్ లెక్చరర్లు, 184 మంది ఒకేషనల్ లెక్చరర్లు, 390 మంది పాలిటెక్నిక్, 270 మంది డిగ్రీ లెక్చరర్లు, సాంకేతిక విద్యాశాఖలో 131 మంది అటెండర్లు, వైద్య ఆరోగ్య శాఖలో 837 మంది సహాయకులతోపాటు వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులను సైతం గత ప్రభుత్వం క్రమబద్ధీకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నిరుద్యోగులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ తరహా నిర్ణయాల కారణంగా తమ భవిష్యత్తు దెబ్బ తింటుందంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. అందులోభాగంగా వారు హైకోర్టును ఆశ్రయించారు.

## చేతగానోనికి మాటలెక్కువ



మొదటిపేజీ తరువాయి

నుండి లంబాడి బిడ్డల దాకా నువ్వు చేసిన ఘోరాలు సమసిపోవు. తెలంగాణ ప్రజలు మరిచిపోరు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి.. నువ్వు కేసీఆర్.. కేసీఆర్ అంటూ కేసీఆర్ గారి నామస్మరణ చేసినంత మాత్రాన నీ పాపం పోదు. కేసీఆర్ గారి వంటి గొప్ప వ్యక్తి జీవితంలో అర్థం కాడు. తొక్కుకుంటూ తొక్కుకుంటూ వచ్చానని గప్పాలు కొడుతున్నవు. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ నాయకులను తొక్కినవు. షార్ట్ కట్‌లో అధికారం చేజిక్కించుకొని ప్రజలను తొక్కుతున్నవు. నీ వదురుబోతు తనంతో రాష్ట్రానికి ఒరిగేది ఏమీ లేదు. నీ దుర్భాషను ప్రజల విచక్షణకే వదిలేస్తున్నాం అని హరీశ్‌రావు అన్నారు.

## ఆ ఇద్దరు నేరగాళ్లను భారత్‌కు అప్పగించండి

జెనీరో వేదికగా సోమవారం ప్రారంభమైన జీ20 దేశాల శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా పలు దేశాధినేతలతో మోదీ వరుసగా భేటీ అవుతున్నారు. ఈ క్రమంలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆర్థిక నేరగాళ్లు విజయ్ మాల్యా , నీరవ్ మోదీ లను భారత్‌కు అప్పగించాలని ఆయన్ని మోదీ కోరారు. భారత్‌లో రూ.9వేల కోట్ల మేరకు బ్యాంకు రుణం ఎగవేసి విజయ్ మాల్యా దేశం విడిచి పారిపోయిన విషయం తెలిసిందే. 2016లో ఆయన లండన్ పారిపోయాడు. ఆ తర్వాత పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు నీరవ్ మోదీ దాదాపు రూ.14 వేల కోట్ల రుణం ఎగవేసిన ఉదంతం 2018లో వెలుగులోకి వచ్చింది. అతను కూడా విదేశాలకు పారిపోయాడు. ఈ కేసును సీబీఐ, ఈడీ విచారిస్తోంది. దర్యాప్తులో భాగంగా నీరవ్ ఆస్తులను కూడా ఈడీ స్వాధీనం చేసుకుంది. ఈ ఇద్దరు ఆర్థిక నేరగాళ్లను స్వదేశానికి రప్పించేందుకు భారత ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో నీరవ్ మోదీ తమదేశంలోనే నివసిస్తున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం 2018 డిసెంబర్‌లో ప్రకటించింది. దీంతో అతడిని తమకు అప్పగించాలని భారత్ విజ్ఞప్తి చేయగా.. 2019లో నీరవ్ మోదీని అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. అతన్ని భారత్‌కు అప్పగించేందుకు బ్రిటన్ ప్రభుత్వం ఆమోదం కూడా తెలిపింది. ఈ పరిణామాలతో నీరవ్ అక్కడి కోర్టులో పిటిషన్ వేయగా.. దాన్ని న్యాయస్థానం కొట్టివేసింది. తాజాగా వీరిని అప్పగించాలంటూ బ్రిటన్ ప్రధానిని మోదీ కోరారు. వీరితోపాటు పన్ను ఎగవేత, మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న మధ్యవర్తి సంజయ్ భండారీని కూడా రప్పించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నది.

## పోలవరం ఎత్తు తగ్గేదే లేదు

మొదటిపేజీ తరువాయి

అడుగులు ఉండాలని స్పష్టంగా పేర్కొందని వివరించారు. అదే ఎత్తుకు ప్రాజెక్టు నిర్మించడానికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. పోలవరంపై కొందరు ప్రతిరోజూ దురుద్దేశకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. పోలవరం కేంద్ర ప్రాజెక్టు అని గుర్తు చేశారు. ప్రాజెక్టును రూ. 55 వేల కోట్లతో నిర్మిస్తున్నామని వివరించారు. నిర్దిష్ట సమయంలో పోలవరాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. కేంద్రం ఈ ప్రాజెక్టుకు రెండేళ్ల ఖర్చుకు 12,157 కోట్లు మంజూరు చేశారని, వీటిలో ఇప్పటికే రూ. 2,900 కోట్లు డబ్బులు వచ్చాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే 350 టీఎంసీల నీటిని ఉపయోగించుకునేందుకు అవకాశముంద న్నారు. కుడికాలువ ద్వారా 3.20 లక్షల ఎకరాలకు . ఎడమ కాలువ ద్వారా 4 లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు వస్తుందని, మొత్తం 24 లక్షల ఎకరాలు స్థిరీకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి దుర్మార్గపు ఆలోచన రాష్ట్రానికి శాపంగా మారిందని అన్నారు. గత టీడీపీ పాలనలో పోలవరాన్ని 72 శాతం పూర్తి చేస్తే గత వైసీపీ ప్రభుత్వం 3.84 శాతం మాత్రమే పూర్తి చేసిందన్నారు. పోలవరం ఏపీకి జీవనాడి,



వెన్నెముక, అమరావతి, పోలవరం ఏపికి రెండు కళ్లు లాంటివని పేర్కొన్నారు.

## టైం మీరు చెప్తారా మమ్మల్ని చెప్పమంటారా

మొదటిపేజీ తరువాయి

పోగొట్టుకున్న రైతులు కూలీలుగా మారారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఫార్మా సిటీ రద్దు చేసి.. రైతులకు తిరిగి భూమి ఇస్తామని చెప్పారు. ఫోర్త్ సిటీ పేరుతో 14 వేల ఎకరాలకు తోడుగా మరో 16 వేలు సేకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. రియల్ ఎస్టేట్ పేరుతో రైతుల భూములు లాక్కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కొడంగల్ లో రైతులు భూమి ఇవ్వలేమని కాళ్ళు మొక్కినా బెదిరించి సెకరించే ప్రయత్నం చేస్తున్నారు. స్వయంగా కలెక్టర్ నాపై దాడి జరగలేదని చెప్పారు. లగచర్ల చుట్టూ పక్కల గ్రామాలకు మాత్రమే సమస్య కాదు.. ప్రతీ రైతు రేపటి రోజున మాకు సమస్య వస్తుందని భయపడుతున్నారు. రైతులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. రైతులు నక్సలైట్లు కాదు.. వేరే వాళ్ళ భూములు అడగడం లేదు.. రేవంత్ రెడ్డిది మా కొడంగల్ కాకపోయినా గెలిపిస్తే మమల్ని హింసిస్తున్నారని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఎంతో మంది ముఖ్యమంత్రులను చూశాం.. కానీ రేవంత్ లా ప్రజలను ఇంతగా ఎవరు హింసించలేదు. మూసీ పక్కన ఉన్న భూములను లాక్కొని.. కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నారు. ఒక వైపు హైడ్రా కూల్చివేతలు.. మరోవైపు లగచర్లలాంటి ఘటనలు జరుగుతుండగా ఇంకోవైపు ప్రభుత్వం సంబరాలు చేసుకుంటున్నారు. రేవంత్ ! నీ స్థాయి ఎంత ? మహారాష్ట్ర వెళ్లి ప్రధానిపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నావు. ప్రజాక్షేత్రంలో ఒకలా . ! ఢిల్లీ వెళ్లి మోడీని కలిసినప్పుడు మరోలా వ్యవహరిస్తున్నావు. ఏ వర్గాన్ని వదలకుండా అన్ని వర్గాల ప్రజలను రేవంత్ మోసం చేశాడు.

## రాష్ట్రపతికి ఖర్గే లేఖ

ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది నిరాశ్రయులై శరణార్థి శిబిరాల్లో బతుకులు వెళ్లదీస్తున్నారు. ప్రజల బాధలు వర్ణనానీతం" అని ఖర్గే రాష్ట్రపతికి రాసిన లేఖలో పేర్కొన్నారు. అంశాంతి కారణంగా మణిపూర్ ఆర్థిక పరిస్థితి దెబ్బతిందన్నారు. వ్యాపారాలు మూతపడ్డాయని, ఉపాధులు పోయాయాని, ప్రొఫెషనల్స్ సొంత ఇళ్లు కూడా విడిచిపెట్టి వెళ్లిపోయారని, నిత్యావసరాలైన ఆహారం, మందుల కొరత ఎక్కువైందని, 2023 నుంచి జాతీయ రహదారులు దిగ్బంధం చేశారని, స్కూళ్లు, విద్యాసంస్థలు మూతపడ్డాయని, నిరాశ్రయులై శిబిరాల్లో తలదాచుకుంటున్న వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. మణిపూర్ ప్రజల మూగవేదన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విశ్వాసం కోల్పోయి, సొంత గడ్డపైనే అభద్రతా భావంతో గడుపుతున్నారని తెలిపారు. ప్రధానమంత్రి కానీ, రాష్ట్ర ముఖ్యమంత్రి కానీ తన ప్రాణాలు, ఆస్తులు కాపాడతారనే నమ్మకాన్ని వారు కోల్పోయారని ఆ లేఖలో ఖర్గే రాష్ట్రపతి దృష్టికి తెచ్చారు.

## స్వచ్ఛమైన నీరందించడంపై ప్రత్యేక దృష్టి

మొదటిపేజీ తరువాయి

రూ.4 లక్షలు ఖర్చు చేయలేకపోయారని పవన్ మండిపడ్డారు. గత ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఫిల్టర్ బెడ్స్ మార్చలేకపోయారని ఉప ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. ప్రతి గ్రామానికీ రూ.4 లక్షలు ఖర్చు చేసి ఉంటే ప్రజలకు రక్షిత తాగునీరు అందేదని ఆయన చెప్పుకొచ్చారు. అలా చేయకుండా రంగు మారిన నీటినే ప్రజలకు సరఫరా చేసి వారి ఆరోగ్యంతో ఆటలాడారని ఆయన ధ్వజమెత్తారు. అందుకే ఏపీ ప్రజలకు స్వచ్ఛమైన నీరందించడంపై ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టినట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఈ మేరకు గుడివాడ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఫిల్టర్ బెడ్లు మార్చామని, అందుకు రూ.3.3 కోట్ల వ్యయం అయిందని ఆయన తెలిపారు. ఫిల్టర్ బెడ్స్ నిర్దేశిత సమయంలో మార్చడం, ఇతర ప్రమాణాలను పాటించడంలో ఎక్కడా రాజీపడవద్దని అధికారులను ఆదేశించినట్లు పవన్ చెప్పారు. గత పాలకులు నిర్లక్ష్యపూరిత వ్యవహారాల మూలంగానే డయేరియా ప్రబలి అనేక మంది ప్రాణాలు పోయాయని ఉప ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ఎప్పటికప్పుడు నిర్దేశిత కాల వ్యవధిలో నిర్వాహణ పనులు చేపట్టాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

## అభివృద్ధిని అడ్డుకుంటే జైల్లోవేస్తా!

హరీశ్‌రావుపై అసహనంతో ఊగిపోయారు. 'కేసీఆర్ ఫాంహౌస్‌లో ఉండి ఇద్దరిని వదిలిపెట్టిండు. వారు ఊర్లమీదపడి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. అభివృద్ధి కాళ్లకు కట్టె పెడితే జైలులో పెట్టి ఊచలు లెక్కబెట్టిస్తాం' అంటూ బెదిరింపులకు దిగారు.

**– కిషన్‌రెడ్డి మోదీకి గులాంగిరి**

గుజరాత్‌లో నరేంద్రమోదీ సబర్మతి నదిని అభివృద్ధి చేస్తే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చప్పట్లు కొడతారని, హైదరాబాద్‌లో మూసీని అభివృద్ధి చేస్తామంటే మాత్రం అడ్డం పడుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అపహాస్యం చేసిన ప్రధాని మోదీ తెలంగాణ ద్రోహి అని, అలాంటి ద్రోహికి కిషన్‌రెడ్డి గులాంగిరీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తనను సోనియాగాంధీకి గులాం అని కిషన్‌రెడ్డి విమర్శించారని, తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ కాళ్లు కడిగి నెత్తిమీద పోసుకునేందుకు తాను సిద్ధమని చెప్పారు. 'కిషన్‌రెడ్డి.. గుజరాత్‌కు గులాంవా? మోదీకి గులాంవా? గుజరాత్‌కు పోయి గాడిదలను కాసుకో.. అక్కడే గులాంగిరీ చేసుకో' అని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ అంటే ప్రపంచదేశాలకు ఒక ఉక్కు మహిళ అని, రాష్ట్రంలో ఉన్నది ఆడబిడ్డల రాజ్యమని ధైర్యంగా చెప్పుకోవాలని అన్నారు.

ఇప్పటికే రాష్ట్రంలోని రైతులకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అకౌంట్లు సరిగా లేకపోవడం, ఇతర కారణాలతో మాఫీ కాని వారికి త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ఖాతాలను సవరించుకోవాలని రైతులకు సూచించారు. రాష్ట్రానికి ప్రతినెలా రూ.18,500 కోట్లు ఆదాయం వస్తున్నదని, ఉద్యోగుల జీతాలు, పింఛన్లకు రూ.6,500 కోట్లు, అప్పులపై వడ్డీలకు రూ.6,500 కోట్లు ఖర్చువుతున్నాయని, మిగిలిన నిధులతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెవివరించారు. వరంగల్ ఎయిర్‌పోర్టును పునరుద్ధరించి, పరిశ్రమలు నెలకొల్పితే కాకతీయవర్సిటీ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని అన్నారు. వరంగల్, కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టులు నిర్మించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

WWW.NETIDARSHINI.COM
నేటి దర్శిని
తెలుగు దిన పత్రిక

## గురుకుల పాఠశాలలో విద్యార్థికి పాముకాటు

### ప్రిన్సిపల్ నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆందోళన



**నకిరేకల్,నవంబర్ 19(నేటి దర్శిని):** కేతేపల్లి మండలం మూసి మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి విద్యార్థి గణేష్‌కు పాముకాటు తగలడం కలకలం రేపుతోంది. గణేష్ ప్రస్తుతం నకిరేకల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యులు 24 గంటలు గడిస్తే గాని పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేమని వెల్లడించారు. విద్యార్థి తల్లిదండ్రులు ఇప్పటికే పాఠశాల ప్రాంగణంలో పాములు, తేళ్లు తిరుగుతున్నట్లు ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, వారు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపిస్తున్నారు. “అలాంటి సమస్యలను మేము చూసుకుంటాం” అని చెప్పి ప్రిన్సిపల్ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. మూసి పాఠశాలలో చదివించడానికి తల్లిదండ్రులు ఇప్పుడు గందరగోళంలో ఉన్నారు. అడవి ప్రాంతం లాంటి ఈ పాఠశాలలో కనీస వైద్యసదుపాయాలు లేవని, ఫస్ట్‌ఎయిడ్ సదుపాయం లేకపోవడంతోపాటు హెల్త్ సూపర్వైజర్ కూడా అందుబాటులో ఉండకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రిన్సిపల్ నిర్లక్ష్య వైఖరిని విద్యార్థుల భద్రతకు ప్రమాదకరంగా భావిస్తున్నారు.

## సయ్యద్ అబ్దుల్ రవూఫ్ కు ఘన సన్మానం



**బడంగ్‌పేట్,నవంబర్19 (నేటి దర్శిని):** తెలంగాణ రాష్ట్ర గిగ్ ప్లాట్ ఫారం నూతన అధ్యక్షులుగా సయ్యద్ అబ్దుల్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ముషీరాబాద్లో సీఐటీయూ నాయకులు శ్రీకాంత్, ఏఐటీయూసీ బి. వెంకటేశంల నాయకులు ఆధ్వర్యంలో సయ్యద్ అబ్దుల్ రౌఫ్ న్ను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మొండి కత్తి బిక్షమయ్య గారి దినకార్యంలో ఏకే ఫౌండేషన్ ద్వారా సహాయం



**త్రిపురారం,నవంబర్19(నేటిదర్శిని):** నల్గొండ జిల్లా త్రిపురారం మండలం బొర్రాయపాలెం గ్రామానికి చెందిన మొండి కత్తి బిక్షమయ్య గారు గత నెల 10న స్వర్గస్తులైన విషయం తెలిసి, ఈ నేపథ్యంలో దినకార్యాన్ని నవంబర్ 20న నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు ఏకే ఫౌండేషన్ చైర్మన్ గౌరవ శ్రీ కట్టెబోయిన అనిల్ కుమార్ దృష్టికి మొండి కత్తి అశోక్ మాదిగ (ఎమ్మార్పీఎస్ టీజీ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్చార్జ్) తీసుకెళ్లారు. గౌరవ చైర్మన్ కట్టెబోయిన అనిల్ కుమార్ స్పందించి తమ ఫౌండేషన్ ద్వారా 50 కేజీల బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. “వారి కుటుంబానికి ఇలాంటి సమయంలో సహాయం చేయడం మా బాధ్యతగా భావిస్తున్నాం,” అని అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు, “మాకు ధైర్యం కలిగించి సహాయం అందించిన కట్టెబోయిన అనిల్ కుమార్ గారికి ఎల్లవేళలా రుణపడి ఉంటాము,” అని కృతజ్ఞతలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో మొండి కత్తి అశోక్ మాదిగ, మొండి కత్తి వెంకటేశ్వర్లు, గద్దల రాజీవ్, మొండి కత్తి రమణమ్మ, మొండి కత్తి వెంకటయ్య, వలదాస్ సైదులు, మొండి కత్తి శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఏకే ఫౌండేషన్ సభ్యులు గుడిపాటి హేమంత్ యాదవ్, రావుల కోటి యాదవ్, గుడిపాటి రాంబాబు యాదవ్, ఎంపీటీసీ కాంస్టెంట్ రామవత్ సైదా నాయక్, గుండెబోయిన సందీప్ యాదవ్ తదితరులు హాజరై, బాధిత కుటుంబానికి మద్దతుగా నిలిచారు.

## తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంను కలిసిన మేడి వెంకన్న



**గుర్రంపోడు,నవంబర్19(నేటి దర్శిని):** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి గారి ప్రీతంను హైదరాబాదులోని వారి నివాసంలో మంగళవారం గుర్రంపోడు మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేడి వెంకన్న మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారితో ఎస్సీ వర్గీకరణ అమలు మరియు ఎస్సీ కార్పొరేషన్ బ్యాంకు రుణాలు మొదలైన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొత్తపల్లి మధు, గుర్రంపోడు మండల కాంగ్రెస్ నాయకులు శివర్ల శేఖర్,బొడ్డు కిరణ్,నల్ల శంకర్,నల్ల అంజి, రేపాక చెన్నకేశవులు,నల్ల నాగరాజు,నల్ల రామ్ తదితరులు పాల్గొన్నారు.

## మలక్ పేట్ లో అగ్నిప్రమాదం



**మలక్ పేట, నవంబర్19(నేటి దర్శిని):** మలక్ పేట్ లోని ఓ దుకా ణంలో ప్రమాదవశాత్తు అగ్నిప్ర మాదం చోటుచేసుకుంది. బాధి తులు తెలిపిన వివరాల ప్రకారం... మలక్పేట్ మార్కెట్ యార్డ్(గంజ్ లోని దుకాణం నెంబర్ 392లో ఉన్న ట్రెన్ ఎంటర్ప్రైజెస్ నందు కొంతకాలంగా పేపర్ గ్లాస్ తయారీ జరుగుతుంది. మంగ ళవారం తెల్లవారుజామున దుకాణం పక్కనే ఉన్న చెత్తాచెదారానికి నిప్పు అంటిం చారు. ఆ సమయంలో దుకాణం మూసి ఉంది కానీ.. ప్రమాదవశాత్తు నిప్పు రవ్వలు పడి ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో రూ. 8,50000 విలువచేసే గ్లాసులు కాలిపోయాయని యజమాని రాజేష్ తెలిపారు. మంటలు ఎగిసి పడటంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

## ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా అధికారులు పని చేయాలి




### జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

**సిటీబ్యూరో,నవంబర్19(నేటి దర్శిని):** ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులను 15 రోజుల్లోగా పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులకు సూచించారు. మంగళవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్లో అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, హెచడి లతో ప్రజావాణి, మై జీహెచ్‌ఎంసీ యాప్, ట్విట్టర్, ఆన్ లైన్ ఫిర్యాదుల పరిష్కారం పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్, జోనల్, సర్కిల్ స్థాయిలో ప్రజావాణిలో ఎక్కువగా టౌన్ ప్లానింగ్‌పైన ఫిర్యాదులు వస్తున్నాయని, అందుకు గల కారణాలు సంబంధిత అధికారులను అడిగారు. ఫిర్యాదుల పరిష్కారంపై విశ్లేషిస్తూ, టౌన్ ప్లానింగ్కు సంబంధించి ప్రారంభ దశలోనే ఫిర్యాదు వచ్చినట్లయితే ఎంక్వయిరీ, తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజలవిశ్వాసాన్ని కలుపుకునేలా అధికారులు నిబద్ధతతో పని చేయాలన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో చూడాలని తెలిపారు. సకాలంలో ఫిర్యాదులను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. సమస్య పరిష్కరించ గలిగినదైతే వారంలోగా పరిష్కరించాలని, పరిష్కారం కాలేనిదైతే అందుకు గల కారణాలను ఫిర్యాదుదారుకు తెలియజేయాలన్నారు. అదేవిధంగా మై జీహెచ్‌ఎంసీ యాప్, ట్విట్టర్, ఆన్ లైన్లో వస్తున్న ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా వెంటవెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, నళిని పద్మావతి, గీతా రాధిక, స్నేహ శబరీష్, సుభద్ర దేవి, సత్యనారాయణ, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, పంకజ, సరోజ, రఘు ప్రసాద్, అశోక్ సామ్రాట్, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, రవి కిరణ్, ఉపేందర్ రెడ్డి, సిఎంహెచ్వో పద్మజారాణి, చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న కాంగ్రెస్

### టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ శ్రీనివాస గుప్త





**నాగోల్,నవంబర్19(నేటిదర్శిని):** ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. నాగోల్ లోని ఈదమ్మ మాత తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలను మంగళ వారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, చుకయ్య, శంకర్, లక్ష్మి నారాయణ, శ్రీనివాస్, మధు, కార్తీక్, విజయ్, సంజీవ్, విఘ్నేష్, చైతన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చేసిందేమీలేదు



సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సాయిబాబా

**సికింద్రాబాద్,నవంబర్ (నేటి దర్శిని):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 12నెలల్లో చేసిందేమీలేదని సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పీ.సాయిబాబా తెలిపారు. అశోక్ నగర్లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న హంగామా చూస్తుంటే ‘మొగున్ని కొట్టి మగశాల కెక్కిన’ చందంగా తలపిస్తుందని ఆయన అన్నారు. గడచిన 12 నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసింది ఏమీ లేదని, చీటికిమాటికి అధిష్టానం మెప్పు కోసం దాదాపు 20 నుండి 25 సార్లకు పైగా ఢిల్లీకి వెళ్లారని తెలిపారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు సైతం తమ పదవులు కాపాడుకునే ప్రయత్నంలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని అన్నారు. ఎన్నికలకు ముందు ఆరు హామీలంటూ ఊదరగొట్టి, ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిశోర్, పి.బాలరాజు గౌడ్, మేడిపల్లి శ్యామ్ సుందర్, తడక వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని జోనల్ కమిషనర్ కు వినతి



**నేరేడ్‌మెట్,నవంబర్19(నేటిదర్శిని):** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని పలు సమస్యల పరిష్కారానికై మంగళవారం జి.హెచ్.యం.సి. జోనల్ కమిషనర్ రవికిరణ్ ను తన కార్యాలయంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్.కె.పురం బ్రిడ్జి మరమత్తులు వెంటనే చేపట్టాలని, మరమత్తులు చేపట్టే ప్రజలకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక ఉపశమనం కల్పించాలని, అదే విధంగా బ్రిడ్జి వెడల్పు చేసేందుకు చొరవ చూపించాలని, ఎన్.ఎం.డి.సి నుండి జడ్.టీ.సీ చౌరస్తా వరకు బాక్స్ డ్రైన్ పనులు ఎస్.ఎన్.డి.పి. లో భాగంగా నిర్మించాలని, సి.ఆర్.ఏం.పి. పరిధిలోని అన్ని రోడ్లను రిపేర్ చేయాలని, యప్రాల్ జంక్షన్ అభివృద్ధి చేయాలని, మౌలాలి మారుతి నగర్, ఆర్.టి.సి. కాలనీ మెయిన్ రోడ్డుపనులను త్వరగా ప్రారంభించాలని, బలరాం నగర్ ఎస్.టి.పి డీశిల్టింగ్ చేయాలని జోనల్ కమీషనర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం పరశురామ్ రెడ్డి, మేకల రాము యాదవ్, అనిల్ కిషోర్ గౌడ్, భాగ్యానంద్ రావు, వంశీ ముదిరాజ్, బాచి, పేపర్ సీను, మౌసీన్, సురేష్, జనార్ధన్, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

## మినాక్షి చౌదరికి మరో ఛాన్స్



'తండేల్' సినిమాతో ఫుల్ బిజీగా ఉన్నారు నాగచైతన్య. ఆ తరవాత 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నాడు. స్క్రిప్ట్ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇప్పుడు నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల కోసం ఎంపిక జరుగుతోంది. ఈ చిత్రంలో కథానాయికగా మీనాక్షి చౌదరిని ఎంచుకొన్నట్టు చిత్ర వర్గాల నుంచి సమాచారం. చైతూ పక్కన నటించడం మీనాక్షికి ఇదే మొదటిసారి.. ఈ కాంబో ఫ్రెష్ గా ఉంటుందని చిత్రబృందం అనుకుంటోందట. ఈ సినిమాలో పూజా హెగ్డే కథానాయికగా నటించబోతోందని కూడా వార్తలు వస్తున్నాయి. దాంతో ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉండబోతున్నట్టు ఫిక్సయింది. మీనాక్షి చౌదరి ఈ ఏడాదంతా బిజీ బిజీగా గడుపుతోంది. సంక్రాంతికి ఆమె నటించిన 'గుంటూరు కారం' విడుదలైంది. మహేశ్‌కు మరదలుగా కనపించింది. ఇటీవల విడుదలైన 'లక్కీ భాస్కర్'తో సూపర్‌హిట్ అందుకుంది. మొన్నే మట్కా విడుదలైంది. ఈ వారంవిడుదల కానున్న మెకానిక్ రాకీలో కూడా ఆమె కథానాయికగా నటించింది. 2025 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానున్న 'సంక్రాంతికి వస్తున్నాం'లో కథానాయికగా నటిస్తోంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో మోస్ట్ బిజీయెస్ట్ కథానాయిక గా మారింది మీనాక్షి. ప్రస్తుతం తన చేతిలో నాలుగు సినిమాలున్నాయి. ఇప్పుడు చైతూ సినిమా కూడా యాడ్ అయింది.

## నయనను మాజీ ప్రియుడు యాక్టింగ్ చేయవద్దన్నాడట..!



లేడీ సూపర్ స్టార్ నయనతార ప్రొఫెషనల్‌గా ఎంత పాపులారిటీ సంపాదించుకుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. గతంలో పర్సనల్ లైఫ్‌కు సంబంధించి రిలేషన్ షిప్స్‌తో తరచూ వార్తల్లో ఉంటూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచేది. ప్రస్తుతం సక్సెస్‌ఫుల్‌గా విఘ్నేశ్ శివన్‌తో వైవాహిక జీవితాన్నిఎంజాయ్ చేస్తోంది నయనతార. అయితే నటుడు, కొరియోగ్రఫర్ ప్రభుదేవాతో చాలా ఏండ్ల క్రితం రిలేషన్ షిప్‌లో ఉన్న ఈ భామ 2011లో పెండ్లికి కూడా రెడీ అయిందని.. వెడ్డింగ్‌కు కొన్ని రోజుల ముందే ప్రభుదేవా-నయనతార విడిపోయారని వార్తలు వచ్చాయని తెలిసిందే. నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీలో రిలేషన్‌షిప్‌లో ఉన్నప్పటి ఆసక్తికర విషయాన్ని షేర్ చేసుకుంది. తెలుగులో వచ్చిన శ్రీరామరాజ్యం తన చివరి సినిమా అనుకున్నానంది నయనతార . తాను సినిమాలను విడిచిపెట్టాలని ఎప్పుడూ కోరుకోలేదని.. అయితే తన మాజీ బాయ్‌ఫ్రెండ్ తనను పెళ్లి చేసుకోవాలంటే యాక్టింగ్ వదిలేయాలని షరతు పెట్టినట్లు చెప్పింది. పెళ్లికి ముందు నటించడం మానేయమని అప్పటి తన ప్రియుడు కండిషన్ పెట్టాడని స్పష్టం చేసింది. దివంగత లెజెండరీ దర్శకుడు బాపు డైరెక్ట్ చేసిన శ్రీరామరాజ్యంలో నయనతార సీతగా నటించిన విషయం తెలిసిందే. ఈ మూవీ షూటింగ్ చివరి రోజున ఇదే తన చివరి సినిమా అని భావోద్వేగానికి కూడా లోనైంది. అయితే ఆ తర్వాత మాత్రం అలాంటి షరతులేమి లేకుండా సినిమాల్లో సక్సెస్‌ఫుల్‌గా ప్రయాణాన్ని కొనసాగిస్తోంది నయనతార. మొత్తానికి సినిమాలు వద్దని చెప్పింది ప్రభుదేవానే అంటూ పరోక్షంగా హింట్ ఇచ్చేసిందని ఇండస్ట్రీ అంతా తెగ చర్చ నడుస్తోంది.

## అమీర్‌ఖాన్ టార్గెన్ చేసిన సల్మాన్



బాలీవుడ్ కా భాయ్ 'సల్మాన్ ఖాన్' అభిమానులతో పాటు హేటర్స్ కూడా ఎక్కువే. కానీ, భాయ్ హేటర్స్‌ని మాత్రం పట్టించుకోకుండా కొన్ని దశాబ్దాల నుండి బాలీవుడ్‌లో స్టార్ హీరోగా కొనసాగుతున్నారు. ఆయనకు సహచర నటీనటులతో కూడా చాలా మంచి సంబంధాలు కొనసాగిస్తారు. మరికొందరు నటులు ఆయనపై తీవ్ర ఆరోపణలు చేసిన సల్మాన్ పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించరు.అయితే పర్ఫెక్ట్ హీరోగా పేరు పొందిన 'అమీర్ ఖాన్'పై ఆయన బహిరంగంగానే తన ద్వేషాన్ని ప్రదర్శించారు. ఇంతకీ ఏమైందంటే.. 2016లో రెజ్లింగ్ ఆధారంగా సల్మాన్ ఖాన్ 'సుల్తాన్' సినిమా రిలీజై సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. రూ. 90 కోట్లతో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ. 623 కోట్ల వసూళ్లను కైవసం చేసుకుంది. అయితే అదే ఏడాది రెజ్లింగ్ ఆధారంగా నితేశ్ తివారి దర్శకత్వంలో 'అమీర్ ఖాన్' ప్రధాన పాత్రలో నటించిన 'దంగల్' సినిమా తెరకెక్కింది. ఈ సినిమా ఏకంగా కొత్త చరిత్రనే సృష్టించింది. రూ. 70 కోట్లతో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ. 2000 కోట్లకు పైగా వసూళ్లను కొల్లగొట్టి సరికొత్త చరిత్ర రికార్డ్ చేసింది. ఈ నేపథ్యంలోనే సల్మాన్ ఖాన్ అమీర్ ని టార్గెట్ చేస్తూ ట్విట్టర్ లో ఒక పోస్ట్ చేశారు. సల్మాన్ పోస్ట్ రాస్తూ.. "నా ఫ్యామిలీ ఈరోజు అమీర్ ఖాన్ 'దంగల్' సినిమా చూసింది. వారికి నా 'సుల్తాన్' సినిమా కంటే ఎక్కువగా నచ్చింది. పర్సనల్‌గా నువ్వంటే నాకు అభిమానమున్న వృత్తిపరంగా 'ఐ హేట్ యూ అమీర్' అంటూ" సరదాగా పోస్ట్ చేశారు. దీంతో అప్పట్లో ఈ పోస్ట్ తెగ వైరల్ అయ్యింది. సరిగ్గా ఈ ఘటన జరిగి ఎనిమిదేళ్లు గడుస్తుండటంతో మరోసారి ట్రెండింగ్‌లోకి వచ్చింది.

## త్వరలోనే అసలు నిజం బయటపడుతుంది : జానిమాస్టర్



లైంగిక వేధింపుల కేసులో జైలుకి వెళ్లి బెయిల్ మీద బయటికి ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ తొలిసారి ఒక మూవీ ఈవెంట్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. జబర్దస్థ్ ఫేమ్, నటుడు రాకింగ్ రాకేశ్ కథానాయకుడిగా నటిస్తూ.. నిర్మిస్తున్న తాజా చిత్రం 'కేసీఆర్' (కేశవ చంద్ర రమావత్). ఈ సినిమాకు 'గరుడ వేగ' అంజి దర్శకత్వం వహిస్తుండగా.. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రానుంది. తనికెళ్ల భరణి, తాగుబోతు రమేష్, కృష్ణ బగవాన్, జబర్దస్త్ ఫేమ్ ధనరాజ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా నవంబర్ 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించగా.. ఈ వేడుకకు జానీ మాస్టర్ వచ్చి మాట్లాడుతూ.. ముందుగా నేను ఈ తప్పు చేయలేదని నమ్మిన ప్రజలందరికీ .. అలాగే నాకు తోడుగా ఉన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. ఇలాంటి పరిస్థితి అనేది వచ్చిన తర్వాత ఎవరు అసలు కనపడరు. అలాంటిది నన్ను మీ ఇంటి పిల్లోడిలాగా.. నన్ను ఆదరించినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. త్వరలోనే అసలు నిజం బయటపడుతుంది అప్పటివరకు వెయిట్ చేయండి అంటూ జానీ మాస్టర్ చెప్పుకోచ్చాడు.

# 'అన్‌స్టాపబుల్' షో సీజన్ 4లో అల్లు అర్జున్ పిల్లల సందడి

### అటజని కాంచె భూమిసురు డంబర చుంబి శిరస్సరజరీ పద్యం చదివిన బన్నీ కూతురు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గారాల పట్టి అల్లు అర్హ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. బన్నీ సోషల్ మీడియాలో ఎంత ఫేమస్సో ఆయన గారాల పట్టి అల్లు అర్హకూడా అంతే ఫేమస్. ఇక నెట్టింట తండ్రీ కూతురు చేసే అల్లరి అంతా ఇంతా కాదు. వీరిద్దరికి సంబంధించిన వీడియోలను బన్నీ భార్య అల్లు స్నేహ రెడ్డి తరచూ సోషల్ మీడియా ద్వారా పంచుకుంటుంటారు. అవి చూసిన బన్నీ ఫ్యాన్స్ తెగ ఖుషీ అవుతుంటారు. వీడియోల్లో అర్హ తన ముద్దు ముద్దు మాటలతో నెటిజన్లను ఆకట్టుకుంటుంటుంది. అయితే ఆర్హ తాజాగా బాలకృష్ణ హోస్ట్‌గా చేస్తున్న 'అన్‌స్టాపబుల్' షో సీజన్4హాజరయ్యింది. తన తండ్రితో పాటు షోకి వచ్చిన అర్హ బాలయ్యతో సరదాగ ముచ్చటించింది. ఇక బాలయ్య కూడా అర్హతో సందడిగా గడపడమే కాకుండా.. దగ్గరికి తీసుకుని ముద్దాడాడు. అయితే ఈ షోలో బాలయ్య అర్హను అడుగుతూ.. తెలుగు వచ్చా అమ్మ అని అడుగుతాడు. దీనికి అల్లు అర్జున్ స్పందిస్తూ.. తెలుగు రావటమా.. అంటూ తన కూతురు చెవిలో పద్యం పాడు అంటాడు. దీంతో అర్హ అల్లసాని పెద్దన్న రచించిన మను చరిత్రలోని "అటజని కాంచె భూమిసురు డంబర చుంబి శిరస్సరజరీ పటల ముహుర్ముహుర్ లుఠ దభంగ తరంగ మృదంగ నిస్వన. స్ఫుట నటనానుకూల పరిఫుల్ల కలాప కలాపి జాలమున్. గటక చరత్కరేణు కర కంపిత సాలము శీతశైలమున్." అంటూ ఫుల్ పద్యం చదివేస్తుంది. దీంతో ఒక్కసారిగా షాక్ తింటాడు బాలయ్య. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.







## రిలీజ్‌కు ముందే పుష్ప-2 రికార్డు



పుష్పరాజ్ అంటే ఫైర్ అనుకుంటివా.. వైల్డ్‌ఫైర్ అనుకుంటూ అల్లు అర్జున్ ట్రైలర్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయంతెలిసిందే. ఈ ట్రైలర్ సెకండ్స్‌లోనే మిలియన్ల వ్యూస్‌ను సొంతం చేసుకొని యూట్యూబ్‌లో టాప్ ట్రెండింగ్‌లో కొనసాగుతుంది. ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పటికే ఓవర్సీస్ బుకింగ్స్ స్టార్ట్ అవ్వగా అరుదైన రికార్డును సాధించింది ఈ చిత్రం. అమెరికా అడ్వాన్స్ బుకింగ్స్‌లో తాజాగా 1 మిలియన్ డాలర్స్ కలెక్షన్స్ వసూలు చేసింది ఈ చిత్రం. సినిమా విడుదలకు ఇంకా 15 రోజులు ఉండగా.. ఇప్పుడే 1 మిలియన్ కలెక్ట్ చేయడంతో అమెరికాలో ఈ ఫీట్ సాధించిన ఫస్ట్ సినిమాగా నిలిచింది. అయితే విడుదలకు ముందే ఈ రేంజ్‌లో బుకింగ్స్ ఉంటే ఇంకా విడుదలయ్యాకా ఎలా ఉంటుందో అని ఫ్యాన్స్ చర్చించుకుంటున్నారు.